

విత్తన గణపతిం భజే..!
పర్యావరణ హితానికి మహిళా సంఘాల ఆధ్వర్యంలో విత్తన మట్టి గణపతులు తయారు చేశారు. ప్రతిమలను గ్రామాల్లో పంపిణీ చేశారు. 8లో▸



ఏకదంతం.. భిన్నరూపం
నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పలు మండపాల్లో గణనాథులు ప్రత్యేక రూపాల్లో కొలువుదీరారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధికి కేరాఫ్‌గా ముఖరా(కె)



ఇంకుడుగుంతను చూపుతున్న డీపీవో

ఇచ్చోడ: జిల్లాలో ముఖరా(కె) పంచాయతీ అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందని డీపీవో శ్రీనివాస్ అన్నారు. ఇంద్రవెల్లి, గాదిగూడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, భీంపూర్ మండలాల నుంచి వచ్చిన ఎంపీవోలు, పంచా యతీ కార్యదర్శులతో కలిసి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం పరి శీలించారు. పల్లె ప్రకృతి వనం, ఇంకుడుగుంతలు, సేంద్రియ ఎరువు తయారీ, సోలార్ వి ద్యుత్ అమలు తీరుతెన్నులపై వారికి అవగా హన కల్పించారు. ఇందులో స్థానిక సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి



సంపదవనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తాంసి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సంపదవనంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని వడ్డాడి ప్రాజెక్టు సమీపంలో ఏర్పాటు చేసిన ఈ వనంను శనివారం పరిశీలించారు. మొక్కల పెంపకం, నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. వారి వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్, డీఎల్‌పీవో ధర్మారాణి, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సూర్యప్రకాశ్, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఏపీవో విజయ, పంచాయతీ కార్యదర్శి అజయ్ తదితరులున్నారు.

'పెటా' సంబరాలు



కేక్ కట్ చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఆదిలాబాద్: వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు రాబోతుండడం శుభపరిణామం అని జిల్లా గిరిజన క్రీడల అధికారి, పెటా సంఘం జిల్లా అధ్యక్షుడు పార్థసారథి అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులపై హైకోర్టు సానుకూల తీర్పు వచ్చిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పెటా సంఘం ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా వ్యాయామ ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. ప్రస్తుతం హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రమోషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వామి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

24 గంటల్లో ఆ ఫ్లెక్సీలన్నీ తొలగించాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ చౌక్‌ల్లో రాజకీయ పార్టీలు, కుల, ప్రజా సంఘాలు, మతపరమైన సంస్థలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు, జెండాలను 24 గంటల్లోపు స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ ప్రకటనలో తెలిపారు. వాటి ఏర్పాటు ద్వారా ప్రజలకు ఇబ్బందులతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లుగా టూటౌన్ పోలీసులు మున్సిపాలిటీకి లేఖ రాసినట్లుగా ఆమె పేర్కొన్నారు. వెంటనే వాటిని తొలగించాలని లేనిపక్షంలో బల్దియా సిబ్బందితో తొలగిస్తామని తెలిపారు. ఇకపై చౌక్‌ల్లో ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని ఆమె సూచించారు.

26న చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఈ నెల 26న ఉదయం 11గంటలకు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రజక కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తలపాగా..



స్టైలే వేరు

- సంస్కృతిలో భాగం
- లేటెస్ట్ ట్రెండ్‌గా రూపాంతరం
- ఫంక్షన్లలో స్పెషల్ అట్రాక్షన్

కైలాస్‌నగర్: తలపాగా.. తలని చుట్టతో కప్పే ఒక వస్త్రము. పైపంచ (ఉత్తరీయం), రుమాల్, పగిడి వంటి ఇతర పేర్లతోనూ పిలుస్తుంటారు. మన సంస్కృతిలోనూ దీనికి ప్రత్యేకస్థానముంది. పలు సామాజిక వర్గాల ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలుస్తుంది. తొలినాళ్లలో అన్నదాతలు ఎండ, వాన, చలి నుంచి రక్షణ కోసం దీనిని ధరించేవారు. కాలక్రమేణ వినియోగంలో మార్పులొచ్చాయి. మనిషి జీవన విధానానికి, హోదాకు చిహ్నంగా మారింది. ప్రస్తుతం ఫంక్షన్లు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లోనూ ధరించడం ట్రెండ్‌గా రూపాంతరం చెందింది. వ్యక్తి ఆహార్యాన్ని ఇనుమడింపజేయడంలోనూ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది.



తలపాగాతో మెస్రం వంశీయులు (ఫైల్)



పగిడిలతో ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్ (ఫైల్)

బంజారాలు దీన్ని పగిడిగా పిలుచుకుంటారు. గౌరవానికి ప్రతీకగా భావిస్తారు. ఈ సామాజిక

గౌరవానికి ప్రతీకగా పగిడి

వర్గంలో ఎన్నికైన నాయక్‌ను గౌరవిస్తూ పగిడి మహోత్సవం నిర్వహిస్తారు. తమ ఆరాధ్య దైవంగా భావించే సంత్ సేవాలాల్ మహరాజ్ పగిడిని ధరించేవారని ప్రతీతి. సన్మార్గంలో క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలనే ఆయన స్ఫూర్తిగా బంజారాలు ధరిస్తున్నట్లు ఆదిలాబాద్ సబ్ అర్బన్ నాయక్ సురేశ్ రాథోడ్ తెలిపారు.

పెళ్లిళ్లు.. ఉత్సవాల్లో స్పెషల్



ప్రస్తుతం ఈ తలపాగా.. వివాహ, ఇతర వేడుకల్లో ట్రెండ్‌గా మారింది. పెళ్లి కుమారుడితో పాటు వేడుకకు హాజరైన వారంతా వాటిని ధరించడం స్టేటస్‌గా భావిస్తున్నారు. మార్కెట్‌లోనూ వివిధ రకాల రంగుల్లో అందుబాటులోకి వచ్చాయి. గణేశ్ నిమజ్జన వేడుకల్లోనూ వీటిని ధరించి సందడి చేయడం ఆకర్షణగా నిలుస్తోంది.

అనాదిగా ఆచారంగా రుమాల్

మెస్రం వంశీయులు దీనిని అనాధిగా ఆచారంగా భావిస్తూ వస్తున్నారు. వారి సంప్రదాయంలో దీనికి ఎంతో విశిష్టత ఉంది. తెల్లని, పసుపు పచ్చని వస్త్రాన్ని వీరు తలపాగాగా ధరిస్తారు. దేవుళ్ల పూజలు, పెళ్లిళ్లలో ముఖ్యంగా నాగోబా జాతర పూర్తయ్యే వరకు తప్పనిసరిగా ధరిస్తుంటారు. నాగోబాను దర్శించుకునేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులకు సైతం తప్పనిసరిగా తలపాగా చుట్టి తమ సంప్రదాయాన్ని పాటిస్తుంటారు. ఐక్యత, క్రమశిక్షణకు రుమాల్



ఆచారం తోడ్పడుతుందని మెస్రం వంశానికి చెందిన ఆనంద్ తెలిపారు. తెలుపు వస్త్రం శాంతికి, పసుపు వస్త్రం మంచికి చిహ్నంగా భావిస్తామని ఆయన పేర్కొన్నారు.

తర్జనభర్జన

- నందిగ్ధంలో గోడం నగేశ్!
- బీఆర్‌ఎస్‌లో కొనసాగడమా.. బీజేపీలో చేరడమా..
- పార్టీ శ్రేణులతో టచ్‌లోకి వచ్చిన మాజీ ఎంపీ
- జోగు రామన్నతో కలిసి కేటీఆర్‌తో భేటీ
- ఎమ్మెల్సీ హామీ ఇచ్చారనే ప్రచారం..
- బీజేపీ నుంచి బోథ్ టికెట్ యత్నిస్తున్నారనే టాక్



గోడం నగేశ్

సాక్షి,ఆదిలాబాద్: బీఆర్‌ఎస్‌లో కొనసాగడమా.. బీజేపీలో చేరడమా అనే విషయంలో మాజీ ఎంపీ గోడం నగేశ్ తర్జనభర్జన పడుతున్నారని పార్టీలో ప్రచారం సాగుతోంది. అధికార పార్టీ నుంచి బోథ్ అసెంబ్లీ టికెట్ ఆశించిన ఆయనకు భంగపాటు ఎదురైంది. నెల క్రితం సీఎం కేసీఆర్ నుంచి పార్టీ అభ్యర్థుల ప్రకటన తర్వాత ఆయన పార్టీ శ్రేణులకు అందుబాటులోకి రాలేదు. ఆ తర్వాత బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే బోథ్ టికెట్‌తో పాటు తన అనుచరులు, కార్యకర్తలకు ఆ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తేనే చేరుతారనే కండిషన్‌తో బీజేపీ పెద్దలతో చర్చించారనే ప్రచారం నడిచింది. బీజేపీ పరంగా సిట్టింగ్ ఎంపీలకు వారి సొంత నియోజకవర్గాల్లో అసెంబ్లీ నుంచి పోటీకి నిలిపే అవకాశాలు ఉంటాయని అధిష్టానం నుంచి విధివిధానాలు ఉండడంతో ఆయనకు టికెట్ పరంగా స్పష్టమైన హామీ లభించలేదనే ప్రచారం సాగింది. ఇదిలా ఉంటే నియోజకవర్గం నుంచి బీజేపీకి దరఖాస్తు పరంగా ఎంపీ సోయం బాపురావు దూరంగా ఉండటం ఆయన కుమారుడు సోయం వెంకటేశ్‌ను రంగంలోకి దించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో గోడం నగేశ్ బోథ్ టికెట్ కోసం బీజేపీ పార్టీ పరంగా కొంత మంది ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో కలిసి అధిష్టానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా నడుస్తోంది.

కేటీఆర్‌తో భేటీ..
అమెరికా పర్యటన నుంచి తిరిగి వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్రంలో అభ్యర్థుల ప్రకటన తర్వాత ఏయే నియోజకవర్గాల్లో అసంతృప్తులు ఉన్నారో అక్కడ పరిస్థితి చక్కదిద్దే విషయంలో ప్రయత్నాలు మొదలు పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లలో అసంతృప్తిదారులతో భేటీ సఫలం కావడం వెనుక పార్టీ పరంగా భవిష్యత్తులో తోడ్పాటు ఉంటుందనే హామీలే కారణమని తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొద్ది రోజుల క్రితం పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి హైదరాబాద్ వెళ్లిన గోడం నగేశ్ కేటీఆర్‌ను కలిశారు. ఈ భేటీలో నగేశ్‌కు భవిష్యత్తులో ఎమ్మెల్సీ ఇవ్వడం జరుగుతుందని, దానికి సంబంధించి జిల్లాలో పర్యటన సందర్భంగా స్పష్టమైన హామీ ఇస్తామని చెప్పినట్లు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నట్లు సమాచారం. ప్రధానంగా గోండు సామాజిక వర్గానికి చెందిన గోడం నగేశ్ సేవలను పార్టీలో ఉపయోగించుకోవాలనే ఆలోచనతోనే బీఆర్‌ఎస్ అధిష్టానం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బోథ్ నియోజకవర్గంలో ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటంతో పార్టీ ఈమేర ఆలోచన చేసినట్లు ప్రచారం సాగుతోంది.

అంతర్మథనం..
అధికార పార్టీ నుంచి ఎమ్మెల్సీ హామీ ఇచ్చారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ గోడం నగేశ్‌లో అంతర్మథనం కొనసాగుతుందని ప్రచారం సాగుతుంది. మరో వైపు కాంగ్రెస్‌లో చేరిక విషయంలోనూ ఆయన సందిగ్ధపడుతున్నారని చెప్పుకుంటున్నారు. ప్రధానంగా ఆ పార్టీలో ప్యారాచూట్ లీడర్లకు టికెట్లు ఇవ్వరాదని ఇటీవల సీనియర్ నాయకుల డిమాండ్ల నేపథ్యంలో ఆయన ఈ పార్టీలో చేరిక విషయంలోనూ సందిగ్ధపడుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఏదేమైనా బీఆర్‌ఎస్‌లో కొనసాగడమా.. బీజేపీ లేని పక్షంలో కాంగ్రెస్‌లో చేరడమా వంటి అంశాల విషయంలో ఇటీవల కార్యకర్తలతో ఆయన టచ్‌లోకి వచ్చారనే విషయం చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ఈ అంశాల పరంగా సందిగ్ధతకు గోడం నగేశ్ తెరదించుతారని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు.

జిల్లాలో భారీ వర్షం

- జలమయమైన రోడ్లు
- పొంగిపొర్లిన వాగులు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల వరకు ఎండఉండగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వాతావరణం పూర్తిగా మారిపోయింది. చిరు జల్లులతో మొదలైన వర్షం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా ఏకధాటిగా కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు బోథ్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, తలమడుగు, జైనథ్, తాంసి, బేల మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో మోస్తారు స్థాయిలో నమోదైంది. అత్యధికంగా బోథ్ మండలంలో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా ఆదిలాబాద్ పట్టణంలో 19.5 మిల్లీ మీటర్లుగా కురిసింది. జిల్లాలోని పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు , రోడ్లు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లగా రాకపోకలకు



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి
బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన గణేశ్‌కు చెందిన ఎడ్లబండి కోట(కె) గ్రామ శివారులో గల ఒర్రెలో శనివారం కొట్టుకుపోయింది. గణేశ్ వద్ద పనిచేస్తున్న గంగాధర్ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చేను నుంచి ఎడ్లబండిపై ఇంటికి వస్తున్నాడు. ఎగువన కురిసిన వర్షానికి ఒర్రెలో నీరు భారీగా చేరింది. దాటే క్రమంలో ఒక్కసారి ప్రవాహం పెరగడంతో ఎడ్లబండిని వదిలి గంగాధర్ అటువైపు ఒడ్డుకు చేరుకున్నాడు. గంగాధర్ రాకపోవడంతో యాజమాని గణేశ్ కొంతమందితో కలిసి చేనువైపు వెళ్లసాగాడు. ఈ క్రమంలో అతడిని చూసిన గంగాధర్ కేకలు వేశాడు. ఎడ్లతో పాటు ఎడ్లబండి కొట్టుకుపోయిందని తెలిపాడు. అతడిని ఇవతలి వైపునకు తీసుకువచ్చారు. ఎద్దులు చనిపోగా సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని గణేశ్ వాపోయాడు.

'నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం'

ఆదిలాబాద్: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. గ్రూప్–1 పరీక్ష రద్దయిన నేపథ్యంలో పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని పేర్కొన్నారు. టీఎస్పీఎస్సీ నిర్లక్ష్య ధోరణి కారణంగా పేపర్ లీకేజీ ఘటన మరువకముందే రెండోసారి గ్రూప్–1 పరీక్ష రద్దవ్వడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్పీఎస్సీ చైర్మన్, సభ్యులంతా బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు విజయ్‌కుమార్, సంతోశ్, పురుషోత్తంరెడ్డి, గ్రూప్–1 అభ్యర్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ..
ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగానే గ్రూప్–1 పరీక్ష రద్దయిందని పీడీఎస్‌యూ పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆత్రం వినోద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగాల భర్తీ విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. కష్టపడి పరీక్ష రాసిన అభ్యర్థులు తీవ్ర ఆవేదన చెందుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సుహాసినిరెడ్డి, నిరుద్యోగులు

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన కార్యాచరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మ్యాన్‌పవర్, వ్యయం, మెటీరియల్, ట్రాన్స్ పోర్ట్ మేనేజ్‌మెంట్, స్వీప్ కార్యక్రమాలు, బందోబస్తు, ఎంసీసీ వంటి అంశాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్, ర్యాంపు, మరుగుదొడ్లు వంటి వసతులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డీడీ దిలీప్‌కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి
రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ తదితరులు

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమష్టిగా పనిచేయాలని సూచించారు. డబ్బు, మద్యం, ఇతర మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, కమర్షియల్, ఇన్‌కంటాక్స్, ఎక్సైజ్ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏడు సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైల్వే, ఆర్టీసీ, కార్గో కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక టీటీడీసీలోని డిస్ట్రిబ్యూషన్ జరిగే ప్రదేశం, పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్డీవో స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో'సారీ'.. నిరాశ!

- 'గ్రూప్–1' రద్దుపై అభ్యర్థుల్లో ఆందోళన
- టీఎస్‌పీఎస్సీ, సర్కారు తీరుపై ఆగ్రహం

కైలాస్‌నగర్: సర్కారు కొలువు సాధించి జీవితంలో నిలదొక్కుకోవాలని ఆశపడ్డ నిరుద్యోగులకు ప్రభుత్వ తీరు రెండోసారి నిరాశకు గురి చేసింది. గ్రూప్–1 పరీక్షల తేదీలు ఖరారైన క్రమంలో ఉన్న ఊరును వదిలి పట్టణాల బాట పట్టి నెలల తరబడి పుస్తకాలతో కుస్తీ పట్టిన అభ్యర్థులకు తాజాగా



గ్రూప్–1 పరీక్ష రాస్తున్న అభ్యర్థులు (ఫైల్)

వెల్లడైన హైకోర్టు నిర్ణయం ఆందోళనకు గురి చేస్తోంది. పరీక్షల నిర్వహణలో లోపాల కారణంగా సర్కారు తీరును తప్పుబడుతూ ఎగ్జామ్ రద్దు చేయాలని న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. కొలువు సాధించడం అటుంచితే.. పరీక్ష రాయడమే అభ్యర్థులకు ఓ పరీక్షలా మారుతోంది. కూలీనాలి చేసి తల్లిదండ్రులు పంపించే డబ్బులపై ఆధారపడి శిక్షణ కేంద్రాల్లో చేరిన వారికి అదనపు భారమే తప్ప ప్రయోజనం చేకూరడం లేదు. లీకేజీ పేరిట టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ఈ పరీక్షను ఓ సారి రద్దు చేయగా.. తాజాగా రెండోసారి రద్దు కావడం గమనార్హం. ఈ ఏడాది జూన్ 11న జిల్లాలోని 19 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. 6,190 మంది కి గాను 4,439 మంది హాజరయ్యారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి



నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా సరైన ప్రణాళిక లేకుండా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తుండడం సరికాదు. వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ పరీక్షల నిర్వహణ తూతూమంత్రంగా నిర్వహించడం టీఎస్‌పీఎస్సీకే చెల్లింది. గ్రూప్–1 పరీక్ష ఇప్పటికి రెండు సార్లు రద్దు కావడం, నిర్వహణ లోపాన్ని ఎత్తు చూపుతోంది. ఇప్పటికైనా హడావుడిగా నోటిఫికేషన్లు ఇవ్వకుండా ప్రణాళికాబద్ధంగా పరీక్షలను నిర్వహించాలి. – సచిన్, బేల

విచారణ చేపట్టాలి



రెండోసారి కూడా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు కావడం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించకుండా నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. ఎన్నికల సమయంలో అస్పష్టమైన నోటిఫికేషన్లు విడుదల చేస్తూ సరిగ్గా పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీనికి టీఎస్‌పీఎస్సీ పూర్తి బాధ్యత వహించాలి. ప్రభుత్వం సైతం ఈ విషయంపై విచారణ జరిపించాలి. – కనకాటే ప్రశాంత్, ఆదిలాబాద్

టీఎస్‌పీఎస్సీ పూర్తిగా విఫలమైంది



గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ పూర్తిగా విఫలమైంది. నిరుద్యోగులకు నమ్మకం కుదరడం లేదు. ఇప్పటికే ఓసారి పరీక్ష రద్దు కాగా, తాజాగా మళ్లీ రద్దు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎంతో కష్టపడి పరీక్ష రాశాను. అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేసిన సంబంధిత అధికారులు వెంటనే రాజీనామా చేయాలి. ఎన్నో ఆశలతో ఉన్నాం. పూర్తిగా నిరాశ చెందాం. – అజయ్, సొనాల, బోథ్

క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకం



అభిషేకం చేస్తున్న వేదపండితులు

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారికి శనివారం వేదమంత్రోచ్ఛరణలతో అభిషేకం చేశారు. ప్రతీ మాసంలో జరిగే సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం పూజలో భాగంగా వేదపండితులు అభిషేకం, కలశ పూజ, గణపతి పూజ, సరస్వతీ పూజ, కుంకుమార్చన పూజలు చేశారు.

ఏఐసీఎఫ్ అబ్జర్వర్‌గా సదానందం



సదానందం

ఇచ్చోడ(బోథ్): ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎ ఫ్) ఆదిలాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్‌గా ఇచ్చోడ మండలానికి చెందిన కె.సదానందంను నియమించినట్లు ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల పేదల కు ఈ కమిటీలు అండగా ఉంటాయన్నారు. పేదరిక నిర్మూలన కోసం చేస్తున్న కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

భైంసాటౌన్(ముధోల్): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో భైంసాకు చెందిన మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు యోగేశ్, ముదస్సిర్ ప్రతిభ కనబరిచారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించిన పోటీల్లో 60 కేజీల విభాగంలో యోగేశ్, 80 కేజీల విభాగంలో ముదస్సిర్ కాంస్య పతకం సాధించారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

పోలీస్ స్టేషన్‌పై దాడిచేసిన పలువురిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌పై శుక్రవారం రాత్రి మూకుమ్మడిగా దాడిచేసి అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై పలు సెక్షన్‌లలో కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి తెలిపారు. కార్యాలయంపై రాళ్లతో తాడిచేయడమే కాకుండా తలుపు రెక్కను, కిటికి అద్దాలు, పూలకుండీలు, వాటర్ బాటిళ్లను పగులగొట్టిన ఘటనలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో పాటు నాయకులు రాము, సంతోశ్, సంజీవ్, అనిల్‌రావు, కిషన్, మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విత్తన గణపతిం భజే..!

పర్యావరణ హితానికి మట్టి వినాయక ప్రతిమల తయారీ, ఏర్పాటు ఏటేటా పెరుగుతోంది. నిర్మల్ జిల్లాలో మాత్రం మట్టి గణేశ్ ప్రతిమలు నిమజ్జనం చేస్తే కరిగిపోవడమే కాదు మొక్కగా మొలకెత్తనున్నాయి. వివిధ రకాల విత్తనాలతో మట్టి ప్రతిమలు తయారు చేయించి అటవీ సంపద వృద్ధికి నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి చేపట్టిన ప్రయోగం సత్ఫలితాల దిశగా సాగుతోంది. విత్తన గణపతులు ఒక్కటే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మలకు కీలకమైన ముడి సరుకు పొనికికర్ర.. అలాంటి పొనికికర్ర కొరత ఏర్పడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో పొనికి కర్ర వనానికి జీవం పోశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



ఇటీవల నిర్మల్‌రూరల్ మండలం భాగ్యనగర్‌లో మట్టి వినాయకులు పంపిణీ చేసిన డీఆర్డీవో విజయలక్ష్మి

సండే స్పెషల్



విత్తన గణపతి

- మట్టి వినాయక ప్రతిమల్లో విత్తనాలు
- ఐదు రకాల విత్తనాలతో తయారీ
- నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

కొందరు వినాయకులను ఇళ్ల వద్ద నిమజ్జనం చేస్తుండగా, ఎక్కువగా చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఎక్కడ నిమజ్జనం చేసినా గణపతి నుంచి మొలక రావాలనే ఉద్దేశంతో పర్యావరణ హిత బీజ గణపతుల తయారీని ఎంచుకున్నారు. భారత ప్రభుత్వం అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువుల పక్కన నడక దారిలో వేప, రావి మొక్కలు నాటాలని సూచిస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధానంగా ప్రతిమల్లో రావి, మర్రి, వేప విత్తనాలతోపాటు జువ్వి, గంధం, సీతాఫలం విత్తనాలతో చిన్న మట్టి గణపతులు తయారు చేశారు. మట్టి కరిగిన తర్వాత అందులోని విత్తనాలు మొలకెత్తుతాయి. డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా ప్రగతి జిల్లా సమాఖ్య రూరల్ మార్ట్ ద్వారా ఏపీఎంలు 15 నుంచి 20 మంది మూడు వేల ప్రతిమలు తయారు చేశారు. ఈ నెల 17న నిర్మల్ కలెక్టరేట్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఒక్కో మండలానికి 200 వరకు అందజేశారు. అక్కడికక్కడే సుమారు వందకు పైగా మంది రూ.100కు ఒకటి చొప్పున కొనుగోలు చేశారు. విత్తన గణపతుల తయారీకి జిల్లా సమాఖ్య నుంచి కొంతమొత్తం రుణంగా పొందారు. ఇలా ప్రతిమల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును రుణం తీర్చడానికి 50 శాతం, తయారీలో పాల్గొన్న ఏపీఎంలు, గ్రామాల్లో పంపిణీ చేసిన వీఓఏల ఖాతాల్లో మిగతా 50 శాతం జమ చేస్తున్నారు.

పొనికివనం..

నిర్మల్ కొయ్యబొమ్మలకు అధిక ధర ఉంటుంది. అందుకు పొనికికర్ర కొరతే కారణమని గ్రహించిన డీఆర్డీవో విజయలక్ష్మి పొనికివనం ఏర్పాటుపై దృష్టి సారించారు. పొనికి మొక్కల కోసం చాలా చోట్ల గాలించారు. మామడ అడవిలో లభించిన పొనికి కర్రను తెచ్చి అంటుగట్టినా ఆశించిన మేరకు ఫలితం రాలేదు. గత సంవత్సరం ఒక్కో నర్సరీలో వెయ్యి చొప్పున పెంచారు. వీటిలో 20 శాతం వరకు బతికాయి. కలెక్టర్ ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం నుంచి ఒక్కో మొక్కను రూ.150 చొప్పున కొనుగోలు చేసి ఐదు వేల మొక్కలు తెప్పించారు. సారంగాపూర్ మండలంలోని ఆరెకరాలు, మామడ మండలంలోని మూడెకరాల అటవీ ప్రాంతంలో పొనికి మొక్కలు నాటారు. కొత్తచిగుర్లు తొడిగి కొమ్మలు వస్తున్నాయి. ఈ పొనికివనంపై అటవీశాఖ ద్వారా సీఎం కేసీఆర్ ఆరా తీసినట్లు తెలిసింది.



పొనికి మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి (ఫైల్)

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో గత సంవత్సరం దీపావళికి మట్టి ప్రమిదలు తయారు చేసి విక్రయించారు. కేవలం పది రోజుల్లో రూ.70వేలు వచ్చాయి. జిల్లా మహిళా సమాఖ్య నుంచి తీసుకున్న రుణం తీర్చగా మిగిలిన లాభాన్ని గ్రామాల్లోని వీవోఏలకే అందజేశారు.
- గత సంవత్సరం జూన్‌లో కడెం మండలం మద్దిపడగ గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలతో సీడ్ బాల్స్ చేయించారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లల కోసం పోషకపాత్ర నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు అదనంగా పోషక పాత్ర అమలు చేస్తున్నారు. పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత రోజుకో తీరున స్థానికంగా లభించే చేపలు, చికెన్, ఆకు కూరలు అందిస్తున్నారు. ఏదీ లేని రోజు పాత్ర నిండా పాలు తాగేలా వీఓఏలు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు.
- తెలంగాణలో మొదటిసారిగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు మధ్యలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గోబర్‌గ్యాస్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా గ్యాస్ వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో వంటలకు సరిపోతోంది.
- ఒకే రోజు 5,940 ఇంకుడు గుంతలు నిర్మించారు. ఒకేసారి నిర్మాణం చేపట్టి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతల వల్ల నీరు ఇంకి బురదగా మారడం తగ్గింది. వీటివల్ల భూగర్భజలాలు వృద్ధి చెందినట్లు తెలుస్తోంది.

రెండు నెలలకో ఇన్నోవేషన్



నిర్మల్ జిల్లాలో బాధ్యతలు చేపట్టి ఏడాది పది నెలలు కావొస్తోంది. మట్టి గణపతుల తయారీ, ఆపరేషన్ సంకల్ప్, కిచెన్‌గార్డెన్, పౌష్టిక పాత్ర, పొనికివనం ఇలా దాదాపు రెండు నెలలకో ఇన్నోవేషన్ తీసుకొచ్చాం. గత దసరాకు మట్టి ప్రమిదలు తయారు చేయించి విక్రయించాం. 'మన అంగన్‌వాడీ–మన ఆకు కూరలు' అనే నినాదంతో ప్రతీ గ్రామంలో కిచెన్‌గార్డెన్ నిర్వహిస్తున్నాం. ప్రతీ ఇంటికి కిచెన్ గార్డెన్, గ్రామంలో కమ్యూనిటీ కిచెన్ గార్డెన్ ఉన్నాయి. మునగాకు, కారప్పొడి తయారీపై ముధోల్‌లో మహిళా సమాఖ్యకు శిక్షణ ఇప్పించా. అడవిలో పెరిగే రేలా విత్తనాలు కూడా వేశాం. ఇంటిగ్రేటెడ్‌ఫార్మింగ్‌పై దృష్టి సారించాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

'అంగన్‌వాడీల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలి'

ఇంద్రవెల్లి(ఖానాపూర్): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరుతూ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ శనివారం ఢిల్లీలో ఎంపీ సోయం బాపురావ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటాన్ని దేశ వ్యాప్తంగా తెలిసేలా పార్లమెంట్‌లో ప్రస్తావించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం చిన్నుపటేల్, రఘురాం, బారిక్‌రావ్, పాండు, అమృత్‌రావ్, జుగాదిరావ్, గణేశ్, తదితరులు ఉన్నారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న వెంకట్‌రావ్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శనివారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

పురుగుల మందుతాగి మహిళ..

బేల(ఆదిలాబాద్): పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మణియార్‌పూర్‌కు చెందిన మేస్రం లత(40)కు ఇరవైఏళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహమైంది. దంపతుల మధ్య గొడవలు తలెత్తడంతో పదేళ్లక్రితం మణియార్‌పూర్‌లోని పుట్టింటికి వచ్చేసింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా పలు ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్తాపానికి గురైంది. శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దాదారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్న వేధింపులతో ఒకరు..

కడెం: అదనపు కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మొలిగే నర్సవ్వ కూతురు లావణ్య(28) ఎనిమిదేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఇందూరి నరేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. కొన్నిరోజులుగా అదనపు కట్నం తేవాలని భర్తతో పాటుగా అత్త, ఆడపడుచు వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లో సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ఖానాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భర్త నరేశ్, అత్త లచ్చవ్వ, ఆడపడుచు సరితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

బేల(ఆదిలాబాద్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాటన్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోయం విశాల్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంటికి వచ్చి భార్య గీతతో గొడవ పడేవాడు. రెండురోజుల క్రితం గీతను ఆమె సోదరుడు పుట్టింటికి తీసుకెళ్లాడు. శుక్రవారం సాయంత్రం ఇంటివద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. శనివారం మృతుని తండ్రి సోయం రాందాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



యోగేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఈ నెల 15న అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సుర్జాపూర్ గ్రామానికి చెందిన గందె యోగేశ్ (28) ఈ నెల 15న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో అతని తండ్రి సాంబయ్య 16న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా శనివారం బాదన్‌కుర్తి సమీపంలోని గోదావరిలో మృతదేహం కనిపించడంతో చేపలవేటకు వెళ్లిన జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు యోగేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెంది గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బోథ్ బంద్ విజయవంతం



మూసి ఉన్న దుకాణాలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆదివారం పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తరలిరానున్నట్లు వారు పేర్కొన్నారు. ఉద్యమంలో భాగంగా చేపడుతున్న దీక్షలు శనివారానికి 70 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో ఖురేషీ కటికే సంఘం సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు సంఘీభావం ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని మన్నూర్ సమీపంలో ఉన్న రాణి జిన్నింగ్ మిల్లు పరిసర ప్రాంతంలో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,800 నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాబాపూర్‌లో చోరీ

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని బాబాపూర్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన హాలిమ బేగం శుక్రవారం నిర్మల్ రూరల్ మండలంలోని ముజాపూర్‌లో ఉన్న తన తమ్ముడి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి లోనికి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన రూ.75 వేల నగదు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి గురైన బైక్ పట్టివేత

నిర్మల్‌టౌన్: ఆర్నెళ్లక్రితం చోరీకి గురైన ఫ్యాషన్ ప్రో బైక్‌ను శనివారం పట్టుకున్నట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన సిద్ధిఖీ బైక్‌ను స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో దొంగలు ఎత్తుకెళ్లారు. నిర్మల్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో సదరు బైక్‌ను ఆపి ధ్రువీకరణ పత్రాలు అడుగగా బైక్ నడుపుతున్న వ్యక్తి తడబడడంతో అనుమానం వచ్చి ప్రశ్నించగా దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. థర్డ్ ఐలో ఎంట్రీ చేసి బైక్ యజమాని ఫోన్‌నంబర్ కనుగొన్నారు. అతనికి ఫోన్ చేయడంతో ఒరిజినల్ పత్రాలు తీసుకురావడంతో వాటిని పరిశీలించి బైక్ అప్పగించారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

- అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్: క్రీడాకారులు నిరంతరం క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్–17 బాలికల ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్, క్యారం, చెస్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా ఆదిలాబాద్ బాలికలు నిలవగా, వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా ఆదిలాబాద్ పాఠశాలకు చెందిన అంకిత నిలిచింది. విజేతలకు అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గోపీచంద్, బీసీ శాఖ అధికారి రాజలింగు, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యాయులు రాజేశ్, సత్యనారాయణగౌడ్, జయశ్రీ, శ్రీలత, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన స్వీప్ జిల్లాస్థాయి పోటీలు

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటుకున్న ప్రాధాన్యత, వినియోగంపై అవగాహన కల్పించేందుకు శనివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్వీప్ పోటీలు అందరిని ఆలోచింపజేశాయి. స్కిట్, కవిత, పద్యాలు, పాటలు అనే విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రదర్శనలిచ్చారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ చాటి జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెమొంటో, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఈవో ప్రణీత, జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఖానాపూర్ సీఐ, ఎస్సైపై ఫిర్యాదు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

నిర్మల్‌చైన్‌గేట్: ఖానాపూర్ సీఐ, ఎస్సైపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మండలంలోని రాజులకు చెందిన గద్దం రవీందర్ శనివారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డికి వినతిపత్రం అందజేసి ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌కు సమస్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బీఆర్‌ఎస్‌లో చేరడం లేదన్న కారణంగా శుక్రవారం రాత్రి ఆపార్టీ నాయకులైన జాన్సన్ నాయక్, అతని అనుచరులు తనతో గొడవపెట్టుకున్నారన్నారు. ఈ విషయంపై మాట్లాడుతుండగానే సీఐ మోహన్, ఎస్సై ఏకపక్షంగా దాడికి పాల్పడ్డారన్నారు.

చట్టాన్ని అగౌరవపర్చడమే..

మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ జాన్సన్ అనే వ్యక్తికి ఖానాపూర్‌తో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జాన్సన్ నాయక్ అనే వ్యక్తి బీఆర్‌ఎస్ తరఫున నామినేషన్ వేయకుండా, బీఫాం తీసుకోకున్నా పోలీసులు అతనికి భద్రత కల్పించడం చట్టాన్ని అగౌరవ పరచడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్న గారి భూమయ్య, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ పాల్గొన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు